# రెండు తారీఖులు

సింహాద్రి శాస్త్రి

అప్పుడే కొన్ని కాగితాలు క్యాలండరులోనుంచి గాలికి వాటంతటవే చిరిగి ఎగిరిపోయాయి. గాలిహోరు కొంచెం తగ్గింది. క్యాలండరు కాగితం రెపరెపలాడుతూ గాలిలో ఎగిరే జండాలా కొట్టు కొంటోంది. అతికష్టంమీద ఆ కాగితంకూడా చిరిగి గాలిలో ఎగిరి పోయింది.

ఎగిరిన కాగితాలు ఎక్కడో మళ్ళీ అతుక్కుంటాయి. ఆ సంగతి మాకు తెలుసు. కానీ కొన్ని కాగితాలు ఆమె క్యాలండరులోంచి బలవంతంగా చింపి, గాలికి కూడా అందకుండా చెయ్యాలని మా....ఉద్దేశం.

అలా బలవంతంగా చింపిన కాగితాలు జాగ్రత్తగా చిన్న పెటిలో వుండలక్రింద నలిపి పెట్టింది. ఆ కాగితాలు సంగతి చెప్పమంటే ఎప్పుడి కప్పుడు మరిపిస్తుంది. కాని వాటి నిజం మా....జీవితంలో ఎవ్వరు తెలుసుకోడానికి యత్నించ వద్దని ఆమె వుద్దేశం.

ఈలాగే ప్రతి సంవత్సరం క్యాలండరులోనూ, రెండే కాగితాలు జాగ్రత్త చేస్తుంది. నాకు తెలిసినంతమట్టుకు ఇప్పటికి ఎనిమిది కాగితాలున్నాయి.

ఆ కాగితాల సంగతి నాకు ఎప్పుడి కప్పుడె తెలుసుకోవాలని జిజ్ఞాసగా వుండేది. వాటి సంగతి చెబితే మా....కి చిన్న సిగ్గు, కొంచం కోపం, కాస్త ఏడ్పు వచ్చినట్లుండి, వెంటనే గదిలోకి వెళ్ళి కొంచంసేపు ఏకాంతంగా కాలం గడుపుతుంది.

క్యాలండరు కాగితాలు సంగతేమిటా యని చాలాసార్లు బాధపడి, విసిగి ఆఖరకు ఒకనాడు రెండు కాగితాలు పెట్టిలోంచి తీసి, నెమ్మదిగా విప్పి చూసాను. ఒకదానిమీద 17 వ తేదీ, రెండో కాగితంమీద 21 వ తేదీ వున్నాయి. వాటి అర్ధం మాత్రం నాకు బోధపడలేదు. చాలా ప్రయత్నించాను. కానీ ఏం లాభం?

ఓనాడు సాయంత్రం ఆమే నేనూ, కలిపి ఊరు దాటి వెళ్లాం. చిన్న దిబ్బపై కూర్చుని, క్రొత్తగా వచ్చిన 'వేమన' సినిమా కబుర్లు చెప్పుకుంటూ. నాకు క్యాలండరు కాగితాలు సంగతి జ్ఞాపకాని కొచ్చి మంచి సమయమని, "17, 21 తేదీలంటే ఎందుకు అంత........"అన్నాను. ఆమె తల వంచుకొని, కొంచంసేపు నిశ్శబ్దంగా వూరుకోంది. నేను దూరాన కనపడే చెట్టు కొమ్మపై నున్న పక్షి జంటలోంచి ఒక పక్షి ఎగిరిపోవడం చూస్తున్నాను, ఇంతలోకే ఆమె నేత్రాలనుండి రెండే రెండు కన్నీటి చుక్కలు రాలాయి.

అప్పుడంది మా.... "ఎప్పుడు నా జీవితంలో ఆ రెండు జ్ఞాపకం చెయ్యకండి. ఆ తేదీలు రెండూ నన్ను ఏడిపిస్తాయి అవి రెండూ నా జీవితాని కొక విషాదఘట్టం" అని. కొంచెం నేనూ దూరం ఆలోచించాను....

అప్పుడు నేను తేల్చుకుందేమిటంటే అందులో 17 వ తేదీ నాదని, 21 వ తేదీ ఆమెదని నేను తెలుసుకొన్నాను. నాకు అప్పుడు పూర్వం సంగతి జ్ఞాపకానికొచ్చి (అంటే నాలుగు సంవత్సరాల క్రితం) అప్రయత్నంగా రెండే రెండు కన్నీటి చుక్కలు జారేయి.

---

## అభిభాషణాలు

'సర్ అక్బర్ హైదర్ అస్సాం గవర్నరై తన రాష్ట్రం తూర్పు పాకిస్తాన్‌లో చేరకూడదంటున్నాడు. అతడు ముసల్మాను ఐనప్పటికీ అతని అర్ధస్థానం హిందూమహాసభా వేదిక.'

—ఘజ్నఫర్ అలీఖాన్

... ... ...

'హిందూమతాన్ని మంచి మందుగా ప్రజలు తాగడంకోసమని బ్రహ్మసమాజం ఆ మతాన్ని కిరస్తానీ సీసాలో పోసింది.'

—రాజాజీ

... ... ...

'హరిజనబాలికను ఒకదానిని ఇండియన్ రిపబ్లిక్‌కు అధ్యక్షురాలిగా చేయాలని నా అభిమతం. ఆమెకు చదువు రానక్కరలేదు. చదువుకున్న ప్రజ్ఞావంతులు ఆమెకు సలహాలిస్తూ పరిపాలన సాగిస్తారు.'

—మహాత్మాగాంధీ